

# సింహాసనంపై రాజాసాబ్

ప్రభాస్ కథానాయకుడిగా రూపొందుతున్న రొమాంటిక్ హారర్ మూవీ 'రాజా సాబ్'. ఈ తరహా జానర్‌లో ప్రభాస్ నటించడం ఇదే ప్రథమం. మారుతి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రభాస్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం ఆయనకు విషెస్ తెలుపుతూ 'రాజా సాబ్' మోషన్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఓ వ్యక్తి అడవిలో నడుస్తూ పెద్ద భవంతికి చేరుకున్నాడు. ఆ భవంతిలో సింహాసనం లాంటి కుర్చీలో కూర్చున్న రాజా సాబ్‌ను మోషన్ మోస్టర్‌లో పరిచయం చేశారు. చేతిలో సిగార్, సాల్ట్ అండ్ పెప్పర్ హెయిర్ స్టైల్‌తో రాజా సాబ్‌గా ప్రభాస్ వింటేజ్ లుక్ అభిమానుల్ని అలరించేలా ఉంది. మోషన్ పోస్టర్‌కు తమన్ ఇచ్చిన రాజా సాబ్ థీమ్ సాంగ్ ఆకర్షణగా నిలిచింది. 'హారర్ ఈజ్ ది న్యూ హ్యూమర్' అనే క్యాప్షన్ ఈ పోస్టర్ చివరలో వేసి, కథపై దర్శకుడు మారుతి ఆసక్తిని పెంచారు. ఏప్రిల్ 10న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్న ఈ చిత్రంలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిధి కుమార్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: కార్తీక్ పళని.

# వెన్నులో వణుకు పుట్టించే థ్రిల్లర్



అను ఇమ్మాన్యుయేల్, శివ కందుకూరి ప్రధాన పాత్రధారులుగా ఓ చిత్రం తెరకెక్కనున్నది. ఈ సినిమా ద్వారా ప్రముఖ ఛాయాగ్రాహకుడు ఆండ్రూ బాబు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. లండన్ గణేశ్, డా॥ ప్రవీణ్‌రెడ్డి పూట్ల నిర్మాతలు. ఉత్కంఠను రేకెత్తించే థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపొందుతున్నదని, లండన్‌లోని అద్భుతమైన లొకేషన్స్‌తో చిత్రీకరణ జరుగుతున్నదని, వెన్నులో వణుకు పుట్టించేలా ఇందులో సన్నివేశాలు ఉంటాయని మేకర్స్ తెలిపారు. త్వరలో టైటిల్ ప్రకటించనున్న ఈ సినిమాలో వైవా హర్ష, వెన్నెల కిశోర్, ఎస్.నివాసిని, షకలక శంకర్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, కెమెరా, దర్శకత్వం: ఆండ్రూ బాబు, నిర్మాణం: బిగ్ మూవీ మేకర్స్ లిమిటెడ్, మైత్రీ ఆర్ట్స్.

# మానవ సంబంధాలకు దర్పణం



శివకుమార్ రామచంద్రవరపు, నితిన్ ప్రసన్న ప్రధాన పాత్రల్లో నటించిన 'నరుడి బ్రతుకు నటన' చిత్రం ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. రిషికేశ్వర్ యోగి దర్శకుడు. టీజీ విశ్వప్రసాద్, సుకుమార్ బోరెడ్డి, సింధు రెడ్డి నిర్మాతలు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో శివకుమార్ రామచంద్రపు మాట్లాడుతూ 'ఈ సినిమాలో నా పాత్ర పేరు సత్య. అతనిది సంపన్న కుటుంబం. నటుడు కావాలనే కోరిక ఉంటుంది. అలాంటి వ్యక్తి అనుకోకుండా కేరళలోని తెలియని ప్రాంతానికి వెళ్లి అక్కడ ఎలా జీవితాన్ని సాగించాడు? అతనికి తోడుగా ఎవరు నిలిచారు? అన్నదే సినిమా కథ. హీరోగా ఈ సినిమా నాకు మంచి పేరు తీసుకొస్తుందని నమ్ముతున్నా' అన్నారు. నితిన్ ప్రసన్న మాట్లాడుతూ 'దర్శకుడు ఈ కథ చెప్పినప్పుడు హార్ట్ టచింగ్‌గా అనిపించింది. మనుషులందరూ పరస్పర ప్రేమ, అభిమానంతో ఉంటే సమాజం ఎంత బాగుంటుందో అనే ఫిలాసఫీతో తీశారు. స్నేహం గొప్పతనాన్ని, మానవ భావోద్వేగాలను అద్భుతంగా ఆవిష్కరించే కథ ఇది. ప్రపంచవ్యాప్తంగా జరిగిన వివిధ ఫిలిం ఫెస్టివల్స్‌లో ఈ చిత్రానికి 60కిపైగా అవార్డ్స్ వచ్చాయి. థియేటర్ నుంచి ప్రేక్షకులందరూ ఓ ఎమోషనల్ ఫీల్‌తో బయటకొస్తారు' అని చెప్పారు.




శివకార్తీకేయన్, సాయిపల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'అమరన్'. రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకుడు. కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ నిర్మాతలు. 'ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్' అనే పుస్తకంలోని మేజర్ వరదరాజన్ అధ్యాయం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను హీరో నాని విడుదల చేశారు. అణువణువునా దేశభక్తిని నింపుకున్న ఆర్మీ ఆఫీసర్ మేజర్ ముకుంద్ వరదరాజన్ స్ఫూర్తిదాయక జీవిత ప్రయాణాన్ని ఆవిష్కరిస్తూ ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. వరదరాజన్ భార్యగా సాయిపల్లవి కనిపించింది. దేశభక్తి, కుటుంబ అనుబంధాలు, త్యాగం అంశాల నేపథ్యంలో ట్రైలర్ ఆకట్టుకుంది. దేశసేవలో మేజర్ వరదరాజన్ చేసిన త్యాగాలకు నివాళిగా ఈ చిత్రాన్ని తెరకెక్కించామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రాన్ని శ్రేష్ఠ మూవీస్ పతాకంపై సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు.



# అరిటాకులో వడ్డించిన విందు భోజనం

'తెలంగాణ నేపథ్యంలో బలమైన కథ చెప్పాలని ఈ సినిమా తీశాను. నిర్మాతల సహకారంతో అనుకున్న విధంగా తెరకెక్కించాం. అరిటాకులో వడ్డించిన విందు భోజనంలా ఉంటుందీ చిత్రం' అన్నారు రమేష్ చెప్పాల. ఆయన దర్శకత్వంలో సాయిరోనక్, ప్రగ్యా నాగ్ర జంటగా నటించిన 'లగ్గం' చిత్రం ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకురానుంది. సుబిషి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై వేణుగోపాల్ రెడ్డి నిర్మించారు. ఇటీవల ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'తండ్రీకూతుళ్ల కథ ఇది. దర్శకుడు రమేష్ చెప్పాలతో 'మీ శ్రేయోభిలాషి' చిత్రం నుంచి అనుబంధం ఉంది. ఆ చిత్రానికి ఆయన రచయితగా పనిచేశారు. ఈ సినిమాలో తెలంగాణ బిడ్డగా నటించడం నా అదృష్టం' అన్నారు. ఈ కథ విన్నప్పుడు కొన్నిసార్లు తన కళ్లు చెమ్మగిల్లాయని, హృదయాన్ని కదిలించే భావోద్వేగాలతో ఆకట్టుకుంటుందని నటి రోహిణి చెప్పారు. ఈ సినిమా ద్వారా మన సంస్కృతి గొప్పతనాన్ని తెలియజేయడంతో పాటు అందమైన సందేశాన్ని అందించామని నిర్మాత వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.



# వినోదాల సంతానప్రాప్తిరస్తు

విక్రాంత్, చాందిని చౌదరి జంటగా నటిస్తున్న చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు'. సంజీవ్ రెడ్డి దర్శకుడు. మధుర ఎంటర్‌టైన్‌మెంట్స్, నిర్వి ఆర్ట్స్ పతాకంపై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. మ్యూజికల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. బుధవారం కథానాయిక చాందిని చౌదరి పుట్టిన రోజు సందర్భంగా ఆమె ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో ఆమె కల్యాణి ఓరుగంటి అనే పాత్రలో కనిపిస్తుందని, ప్రభుత్వ ఉద్యోగి తన జీవిత భాగస్వామిగా రావాలని కోరుకునే అమ్మాయిగా ఆమె పాత్ర సాగుతుందని చిత్ర బృందం పేర్కొంది. ప్రస్తుతం చాలా మంది ఎదుర్కొంటున్న సంతానలేమి అనే సమస్యను వినోదాత్మక కోణంలో ఆవిష్కరించామని, రెగ్యులర్ షూటింగ్ జరుగుతున్నదని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సంభాషణలు: కల్యాణ్ రాఘవ్, దర్శకత్వం: సంజీవ్ రెడ్డి.

# ఆ కోరిక కంగువా తీర్చింది



సూర్య కథానాయకుడిగా శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'కంగువా' నవంబర్ 14న విడుదల కానుంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్స్‌లో సూర్య బిజీగా ఉన్నారు. తాజాగా జరిగిన ఓ కార్యక్రమంలో సూర్య ఆసక్తికరంగా మాట్లాడారు. 'బ్రేవ్ హార్ట్, లార్డ్ ఆఫ్ ది రింగ్స్, గేమ్ ఆఫ్ థ్రోన్స్ లాంటి హాలీవుడ్ చిత్రాలను అందరం ఇష్టపడతాం. వాటిని చూసి ఆశ్చర్యానికి గురవుతుంటాం. ఇలాంటి సినిమాలు మనం ఎందుకు తీయలేకపోతున్నాం? ఎప్పుడు తీస్తాం?.. అని ఆలోచిస్తున్న సమయంలో దర్శకుడు శివ ఈ కథ చెప్పాడు. 'కంగువా' ఓ వినూత్న ప్రయత్నం. వందేళ్లక్రితం జన జీవనం, వారికి ఎదురైన కష్టాలు.. తదితర అంశాలను స్క్రీన్‌పై చూపిస్తే బాగుంటుందని 'కంగువా' చేశాను. హాలీవుడ్ స్థాయి సినిమా చేయాలనే కోరిక 'కంగువా'తో తీరిపోయింది. అనుకున్న కథను అద్భుతంగా తెరకెక్కించిన శివకు థ్యాంక్స్' అని తెలిపారు సూర్య. ఇంకా మాట్లాడుతూ 'నిజానికి 'సూరారై పోట్రు'(ఆకాశమే నీ హద్దు) సినిమాకు ముందు నా సినిమాలు పెద్దగా ఆడలేదు. దాంతో నిరాశకు లోనయ్యా. నా ఇమేజ్ ఎలా మార్చుకోవాలి? కెమెరా ముందు సంతోషంగా ఎలా కనపడాలి? సినిమాతో మళ్లీ ఎలా ప్రేమలో పడాలి? అనే విషయాల గురించి ఆలోచిస్తున్న సమయంలో సుధా కొంగర 'సూరారై పొట్రు' కథ చెప్పారు. ఆ సినిమా విజయం నా కెరీర్‌కి కొత్త ఊపిరిని ఇచ్చింది' అని గుర్తు చేసుకున్నారు సూర్య.








